
క్లుప్తంగా

నీటి వృథాను అరికట్టేదెవరు?


నర్సయ్య తూము లీకులతో బోదెలోకి వెళ్తున్న నీరు

ఉంగుటూరు: తూము కట్టేసి ఉన్నా లీకులు కారణంగా పంట బోదెలో పూర్తి స్థాయిలో నీరు పారుతుంది. ఈ నీరు రైతులకు పంటలకు అవసరం లేదు. నర్సయ్య తూము కింద, ఉంగుటూరు, నాచుగుంట, కాగుపాడు ఆయకట్టు కింద మూడు వందల ఎకరాలు సాగు చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో నర్సయ్య తూము లీకుల వల్ల నీరు వృథాగా పోతోంది. ఈ తూము మరమ్మతుల విషయంలో అధికారులు పట్టించుకోకపోవడం వల్లే నీరు వృథా అవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ వేసవిలోనైనా తూము మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

దంత సంరక్షణతో మానసిక ఆరోగ్యం మెరుగు


భీమడోలు సీహెచ్‌సీలో రోగులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

భీమడోలు: మానసిక ఆరోగ్యానికి దంత సంరక్షణ ఎంతో కీలకమని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సునీత అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రజలకు నోటి ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు. దంతాలను పరీక్షించి మందులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంతోషకరమైన నోరు. సంతోషకరమైన మనస్సు అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దంతాలను, చిగుళ్లను జాగ్రత్తగా చూసుకోవడం ద్వారా దంతాల జీవన నాణ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఆదేశాలు బేఖాతరు



హెచ్చరిక బోర్డులు లారీని నిలుపుదల చేసిన దృశ్యం

దెందులూరు: జాతీయ రహదారులు పోలీసుల హెచ్చరికలకు వాహనదారులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదు భయపడటం లేదు. జాతీయ రహదారిపై హోటళ్లు, దాబాల వద్ద ఎటువంటి వాహనాలు నిలుపుదల చేయరాదని జిల్లా ఎస్పీ, తెదేపా సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా అన్ని దాబాల వద్ద హోటల్లో వద్ద వాహనాల నిలుపుదాల చేయరాదని బోర్డులు ఏర్పాటు చేశారు. సత్యనారాయణపురం సమీపంలో ఉన్న పున్నమి హోటల్ వద్ద పోలీస్ శాఖ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసింది వాహనాలు బోర్డు పక్కనే ఆపడం గమనార్హం. మొబైల్ టీం పోలీసులు లా అండ్ ఆర్డర్ పోలీసులు వాహనాలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

నేడు నియోజకవర్గస్థాయి రహదారి శుభ్రత

దెందులూరు: స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శనివారం నియోజకవర్గస్థాయి రహదారి శుభ్రత కార్యక్రమం జరుగుతుందని దెందులూరు ఎంపీడీఓ కే శ్రీదేవి తెలిపారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7 గంటలకు దెందులూరు మండలం సోమవరప్పాడు నుంచి పెదవేగి మండలం వేగివాడ వరకు రోడ్డు పరిశుభ్రత కార్యక్రమం నియోజకవర్గస్థాయిలో జరుగుతుందని వివరించారు.

నూకాలమ్మ ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, మూలవిరాట్‌కు ఏకాదశ హారతి, వేదదర్బారుసేవ తదితర పూజలు అర్చకులు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ స్థానిక దూడే కనకదుర్గ సత్యనారాయణ (డీకేడీ), భాగ్యలక్ష్మి దంపతులు నూకాలమ్మవారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఆలయ అభివృద్ధికి రూ.25,116లు విరాళంగా అందజేశారని తెలిపారు. దాత దంపతలును ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించామన్నారు.

మానవాళి కోసమే ప్రభువు శిలువ బలియాగం

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

పెదవేగి : మానవ పాప పరిహారార్థమై ప్రభువైన ఏసుక్రీస్తు మరణ కొయ్యకు వేలాడతీయబడ్డారని న్యాయంపల్లి విచారణ గురువు రాచూరి బాలస్వామి అన్నారు. శిలువలో బలియాగమైన కారణంగా పవిత్ర ఉపవాస గుడ్‌ఫ్రై డే ప్రార్థనలు మండలంలోని న్యాయంపల్లి, దుగ్గిరాల, ఎంఆర్‌సికాలనీ, బాపిరాజుగూడెం, విజయరాయి, వేగివాడ గ్రామంలో ఆయా విచారణ గురువుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పెదవేగి మండలం న్యాయంపల్లి విచారణ ఆరోగ్యమాత దేవాలయ ప్రాంగణంలో పవిత్ర శుక్రవారం పురస్కరించుకుని శిలుమార్గాన్ని అన్ని పురవీధుల గుండా తిరుగుతూ రెవరెండ్ ఫాదర్ రాచూరి బాలస్వామి భక్తిశ్రద్ధలతో ఈ పవిత్ర శుక్రవారాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో న్యాయంపల్లి విచారణ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలు, విశ్వాసులు సంఘ పెద్దలు ఉపదేశీలు దీక్షా సహోదరి సహోదరులు, సెంట్ అలోసియస్ సిస్టర్స్ పాల్గొని ఉపవాస ప్రార్థనను ఎంతో ఘనంగా నిర్వహించి దేవుని యొక్క కృపను పొందుకున్నారు.

వేగివాడలో...
వేగివాడ విచారణ గురువు ఫాదర్ పాస్కలి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున క్రైస్తవ విశ్వాసులు, దీక్షపరులు, సంఘస్తులు, కన్యస్త్రీలు గుడ్‌ఫ్రై డే శిలువ మార్గంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫాదర్ పాస్కలి మాట్లాడుతూ పూర్వకాలంలో ఈ శుక్రవారాన్ని బ్లాక్ ఫ్రై డే, పరిగణించేవారని, రానురాను ఏసుక్రీస్తు మరణం ద్వారా మానవ రక్షణకు కారణమైందని గుర్తించారో అప్పటి నుండి గుడ్‌ఫ్రై డేగా పరిగణించారని చెప్పారు. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా ప్రభువైన ఏసుక్రీస్తు శిలువ యాత్రలో భాగంగా 14 స్థలాలలో పొందిన శ్రమలను 14 రీతులుగా ధ్యానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక దివ్యబలిపూజలో ఫాదర్ పాస్కలి దివ్యబలిపూజ అర్పించి, ఆయన సందేశాన్ని అందించారు. ఆయన ప్రసంగిస్తూ 40 రోజులు ఉపవాస దీక్షలు దాన ధర్మాలు, ప్రత్యేక ప్రార్థనలతో తారాస్థాయికి చేరాయన్నారు. భగభగ మండుతున్న సూర్యుడు అస్తమించే సమయానికి శిలువ బలియాగం అయ్యిందని, ఈ శుభ శుక్రవారం అంటే యవత్ ప్రజా క్షేమం కోసం ఏసు శిలువలో బలియాగమవ్వడమేనని చెప్పారు. గత రెండు వేల సంవత్సరాల క్రితమే ఏ విధంగా జీవించాలో క్రీస్తు బోధించారని, శిలువలో బలియాగమైన ప్రభువు తన తుది శ్వాస వరకు మానవుని క్షేమం కోసమే ఆలోచించారని, సమాజంలో ఏ కష్టం వచ్చినా, బాధవచ్చినా ధైర్యంగా ఎదుర్కొని తల ఎత్తుకుని జీవించాలని పేర్కొన్నారు. ఈ ప్రార్థనల్లో విచారణ కన్యస్త్రీలు, ఉపదేసులు, సంఘ పెద్దలు, విశ్వాసులు, తపస్సుకాల దీక్షాపరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విజయరాయిలో ఫాదర్ దివాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిలువ మార్గంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


దెందులూరు: గుడ్‌ఫ్రైడే సందర్భంగా శిలువ మోస్తున్న ఫాదర్ అమ్మన్ రాజా


పెదవేగి: కూచింపూడిలో నిర్వహిస్తున్న శిలువ మార్గంలో 5వ స్థలం వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతోగుడ్ ఫ్రైడే
దెందులూరు: మానవాళి పాప ప్రక్షాళన కోసం తన ప్రాణాన్ని సైతం సిలువపై విడిచి నా యేసు క్రీస్తు మాటలు పయనిస్తూ ఆయన ఆశయాల ౩ం ప్రతి ఒక్కరు అమలు చేయాలని దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జి అమ్మన్ రాజ అన్నారు. శనివారం దెందులూరు మండలంలో గ్రామ గ్రామాన ఆర్‌సీఎం సాల్వేషన్ ఆర్మీ సీఎస్ఐ, ఐసీఎం, మన్నా, పెంతుకోస్తు తో పాటు వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ర్యాలీలు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. దెందులూరు లో ఫాదర్ అ అమ్మనరాజ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. నిర్దేశించిన ఏడు ప్రాంతాల్లో ఏసుప్రభు చెప్పిన మాటల సారాంశాన్ని ఆ ఫాదర్ కళ్యాణ్ ఫాదర్ బాలరాజు వివరించారు. ఆర్‌సీఎం చర్చి నుంచి ప్రారంభమై బస్టాండ్ సెంటర్ మీదుగా తొమ్మిదో వార్డుకు చేరుకున్నారు సంపెంగ వారి వీధి, నర్సింగ్ కళాశాల, బస్టాండ్ సెంటర్, లైబ్రరీ సెంటర్, యాదవుల వీధి, గౌడ వీధి, చినదళితపేట, మీదుగా ఆర్‌సీఎం చర్చికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘస్తులు ఆర్‌సీఎం ఉపాధ్యాయులు, ఉపదేశీయులు యువత పాల్గొన్నారు.

మన్నా చర్చిలో..
దెందులూరు మన్నా చర్చిలో పాస్టర్ బెంజిమెన్ ఆధ్వర్యంలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు అనుసరించిన జీవన విధానం బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయమన్నారు.

భీమడోలులో..
భీమడోలు: మండల వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే ఆరాధన కార్యక్రమాలు క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి నుంచి క్రైస్తవులంతా చర్చిల్లో మోకాళ్లపై ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పెదలింగంపాడు, చినలింగంపాడు, సూరప్పగూడెం, కొల్లేరు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు చేశారు. గ్రామాల్లో సెలువ మార్గపు శాంతి ర్యాలీలను నిర్వహించారు. భీమడోలు విచారణ కర్త ఫాదర్ షింటో థామస్ ఆధ్వర్యంలో భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపిక చేసిన 12 మంది శిష్యులను ఆనాడు ఏసుక్రీస్తు తన శిష్యులు పాదాలు కడిగిన విధంగా ఫాదర్ శిష్యుల పాదాలను కడిగి ముద్దాడారు. డీపాల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫాదర్ నెల్సన్ జాన్ దివ్య పూజ బలి, దివ్య సప్రపాద ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫాదర్ జోసఫ్, ఫాదర్ నెల్సన్ జాన్ భక్తులకు క్రీస్తు సందేశం తెలిపారు. అనంతరం భీమడోలు ఆర్‌సీఎం చర్చి నుంచి వీధుల్లో సిలువలను మోసుకుంటూ ర్యాలీ చేశారు. షింటో థామస్ సిలువను మోస్తూ ముందుకు సాగారు. అలాగే గుండుగొలనులో ఆర్‌సీఎం సంఘ కాపరి ఫాదర్ రెవరెండ్ కాకి చార్లెస్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఎస్ఐ దేవాలయం, భోగాపురంలోని రక్షణ సైన్యం, ఆర్‌సీఎం చర్చిల్లో ఉపవాసంతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామస్తులంతా పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.


భీమడోలు: ఆర్‌సీఎం చర్చిలో దివ్యపూజాబలిని సమర్పిస్తున్న దృశ్యం


భీమడోలు: గుండుగొలనులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు


పెదవేగి: క్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలను ప్రజలకు వివరిస్తున్న ఫాదర్ బాలస్వామి


పెదవేగి: ఎంఆర్‌సీకాలనీలో శిలువను మోస్తున్న ఫాదర్‌లు

నిప్పు పెడితే ముప్పే


చేలల్లో వరి గడ్డిని తగలబెట్టిన దృశ్యం

- పొలాల్లో ఎండుగడ్డిని తగలబెట్టొద్దు
- భూసారానికి నష్టం

పెదవేగి: వరి కోతలు పూర్తయ్యాక చేలల్లో మిగిలిపోయిన ఎండిగడ్డిని అక్కడే తగలబెడితే భూసారానికి తీవ్రనష్టం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రైతులకు దీనిపై అవగాహన లేకపోవడంతో ప్రస్తుత్తం ఎక్కడ చూసినా ఎండుగడ్డిని తగల బెడుతూనే ఉంటున్నారు. ఈ విధంగా గడ్డిని తగలబెడితే భూమి పైపొరల్లో ఉన్న విలువైన సూక్ష్మ పోషకాలు, వాటిని తయారు చేసే జీవులు నాశనమవుతాయని, అంతే కాకుండా పర్యావరణానికి ప్రమాదకరమని పెదవేగి మండల వ్యవసాయాధికారిణి ఎం. ప్రియాంక చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆమె వివరిస్తున్నారు.

భూమి సహజ స్థితిని కాపాడుకోవాలి...
పంట దిగుబడి సక్రమంగా రావాలంటే భూమి సహజ స్థితిని కాపాడుకోవాల్సి ఉంటుందని ఏవో తెలిపారు. అందుకోసం వేసవిలో లోతు దుక్కి చేయడం, పచ్చిరొట్ట సాగు చేయడం చేపట్టాలన్నారు. అలాగే సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలన్నారు. తద్వారా భూమి తన సహజ స్థితిలో ఉండి పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. రైతులకు వివిధ రకాల తెగుళ్లను అరికట్టడానికి పెట్టే ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు.

సారమంతా పైపొరల్లోనే

వ్యవసాయ భూముల్లో సారవంతమైన మట్టి, సూక్ష్మ పోషకాలు, వాటిని తయారు చేసే పలు రకాల జీవుల ఆవాసం భూమి పైపొరల్లోనే ఉంటుందని ఏవో తెలిపారు. కోతలు పూర్తయ్యాక ఎండు గడ్డిని తగలబెడితే ఆ వేడి ప్రభావం కారణంగా పంటకు అవసరమైన భూభౌతిక స్థితిని భూమి కోల్పోతుందన్నారు. తగలబెట్టిన భూమిలో సేంద్రియ కర్బన స్థితి కన్పించదన్నారు. పీహెచ్ లెవల్ కూడా పడిపోతుందన్నారు. వర్షాలు పడిన వెంటనే దున్నేసుకోవచ్చునని, పురుగులు చనిపోతాయని రైతులు అపోహపడుతున్నారన్నారు. ఎండుగడ్డిని తగలబెట్టడం వల్ల మేలు కంటే కీడే ఎక్కువని గుర్తించాలన్నారు. గడ్డిని తగలబెట్టిన భూమి, తగలబెట్టని భూమిలో పంట ఆరోగ్యం పరిశీలించి స్వయంగా రైతులే తెలుసుకోవచ్చునని వివరించారు. వివిధ రకాల జీవాలు, బ్యాక్టీరియా, ఫంగై వంటివి మంటల్లో కాలిపోతాయని చెప్పారు. మళ్లీ సదరు భూమిలో ఇవన్నీ చేరాలంటే ఎంతో కాలం పడుతుందన్నారు. అంత వరకు ఆ భూమిలో సాగు చేసే పంటలకు అధిక మొత్తంలో ఎరువులు, పురుగు మందులు వినియోగించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం ఖర్చు తగ్గుతుందని రైతులు ఆలోచిస్తే భవిష్యత్తులో ఆ ఖర్చు పురుగు మందులు, ఎరువులపై ఖర్చు పెట్టాల్సి వస్తుందని ఏవో హెచ్చరించారు.

వరికోతలతో రైతులు బిజీబిజీ


ధాన్యం బస్తాలు ట్రాక్టర్‌పై ఎగుమతి చేస్తున్న రైతులు

ఎకరాకు 65 నుంచి 70 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా

ఉంగుటూరు: వరికోతలతో మండలంలోని రైతులు బిజీబిజీగా గడుపుతున్నారు. ఏలూరు జిల్లాలో వరి అధికంగా పండించే మండలం ఉంగుటూరు. ఈ మండలంలోని గత పదిహేను రోజులగా ముమ్మరంగా వరికోతయంత్రాలతో కోతలకు రైతులు ఉపక్రమించారు. కోత కోసిన ధాన్యాన్ని తేమ శాతం తగ్గించేందుకు కొందరు రైతులు ఆరబెడుతున్నారు. మరికొందరు రైతులు ధాన్యం తూకాలు పట్టుబడులు పడుతున్నారు. మరికొంత మంది రైతులు ధాన్యం సంచుల్లోకి పట్టి లారీలు, ట్రాక్టర్లు పై ఎగమతి చేసి మిల్లులుకు తరలిస్తున్నారు.

23 వేల ఎకరాల్లో సాగు
మండలం మెత్తం మీద 23062 ఎకరాలలో వరి సాగు సాగింది. ఈ పంట కాలం 125నుంచి 135 రోజులుగా ఉంది. ఒకేసారి డిమాండ్ ఏర్పడడంతో వరికోత యంత్రాలు కొరత రైతులను వేధిస్తున్నారు. ఈ ఏడాది పీఆర్–126 రకం, ఎంటీయూ 1121 రకం పండించారు. ఈసారి 65 నుంచి 70 బస్తాలు ఎకరాకు సగటు దిగుబడి వస్తోంది. మండలంలో ధాన్యం తోలుతున్న మిల్లులు మూడు ఉన్నాయి. కైకరం, చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరు, నాచుగుంట, బాదంపూడి, కాకర్లమూడి, కాగుపాడు, ఎ.గోకవరం, నల్లమాడు, గొల్లగూడెం, గోపినాథపట్నం, ఎ.గోకవరం గ్రామాల్లోని ఆయకట్టులో రహదారుల్లోని ఖాళీస్తలాలలో ధాన్యం రాశులు కనిపిస్తున్నాయి.


నాచుగుంటలో ధాన్యం పట్టుబడులు పడుతున్న దృశ్యం

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

భీమడోలు: కూటమి ప్రభుత్వం రైతులు, కౌలు రైతులకు గుప్పించిన హామీలన్నింటిని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు డిమాండ్ చేసారు. గుండుగొలను, పాతూరు గ్రామాల్లో ఆరబోసిన ధాన్యం వద్దకు వెళ్లి రైతులు, కౌలు రైతుల సమస్యల సీపీఎం బృందం సభ్యులు శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. కౌలు రైతులు తాము పడుతున్న ఇబ్బందులను వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు రైతు భరోసా డబ్బులు తక్షణమే అందించాలని, కౌలు గుర్తింపు కార్డులో యాజమాని అంగీకరించాలన్న నిబంధనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందుగా కూటమి పార్టీలు కౌలు రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వరరావు, కౌలు రైతులు పాల్గొన్నారు.


పాతూరులో రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

21 నుంచి నిత్య సహాయ మాత ఉత్సవాలు

దెందులూరు: మండలంలోని సానిగూడెం గ్రామంలో ఈనెల 21 నుంచి నిత్య సహాయమాత ఉత్సవాలు ప్రారంభమవుతాయని సానిగూడెం గ్రామ నాయకులు ఫ్రాన్సిస్ అన్నారు శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 25 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 23న ఏలూరుపీఠం వికార్ జనరల్ డాక్టర్ పి బాల ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని దెందులూరు మండలంతో పాటు ఇతర మండలాల్లోని భక్తులు ఉత్సవాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆశ్రం సెంటర్‌లో డ్రోన్లతో తనిఖీ

ఏలూరు టౌన్: ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు నగరం, చుట్టపక్కల ప్రాంతాల్లో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సెంటర్‌లో డ్రోన్లను ఎగురవేసి సీసీ కెమెరాలతో ఫొటోలు, వీడియోలు తీస్తూ అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టారు. ఆశ్రం సెంటర్ ప్రాంతంలో నేరస్తులకు అడ్డాగా మారుతుందనే అభియోగాలపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో నిఘా పెట్టారు. ప్రజలకు ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలన్నారు.

సర్వోదయ స్ఫూర్తితో ముందుకు సాగాలి

ఉంగుటూరు: సర్వోదయ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సర్వోదయ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం నాచుగుంట సర్వోదయ స్థూపం వద్ద 65వ సర్వోదయ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ స్వర్గీయ చింతలపాటి మూర్తి రాజు గాంధేయ వాదిగా ఇక్కడ సర్వోదయం సమ్మేళనం నిర్వహించారని ఆ కార్యక్రమం దేశంలోని ప్రజల్లోను, నాయకుల్లో సర్వోదయ స్ఫూర్తి నింపిందన్నారు. కార్యక్రమంలో సర్వోదయ స్ఫూర్తి అవార్డును చర్ల మృదులకు అందజేసి సత్కరించారు. మానవత సేవలందిస్తున్న బోయపాటి రామలక్ష్మికి స్త్రీ శక్తి 2025 అవార్డును అందించారు. సర్వోదయ నాయకులు విద్యాదాత స్వర్గీయ మూర్తిరాజు జీవిత చరిత్ర అనగనగా ఒక రాజు–మూర్తిరాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, మానవత రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకి రామరాజు, ఉంగుటూరు సర్పంచ్ బందారు సింధు, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు పుప్పాలగోపి, అడపా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


నాచుగుంట సర్వోదయ స్థూపం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న సర్వోదయ నాయకులు

నాగాశ్విని పేరంటాలు తల్లి ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: మండలంలోని గాలాయిగూడెంలోని నాగాశ్విని పేరంటాలు తల్లి నాలుగో వార్షిక ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉత్సవాలను ప్రారంభించారు. నిర్వాహకుడు పూజారి అన్నవరం దుర్గమ్మ, పూజారి శ్రీనివాసరావు ఆలయ అర్చకులు ఎమ్మెల్యే, అతిథులకు స్వాగతం పలికారు. ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి కూచిపూడి నృత్యాలు, డాన్స్ బేబీ డ్యాన్స్ నిర్వహించారు. ఆదివారం భక్తుల సమక్షంలో ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందన్నారు. అమ్మవారిని దర్శించి, ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.


నాగాశ్విని అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

నేడు సూరప్పగూడెంలో రీ-సర్వేపై గ్రామసభ

భీమడోలు: మండలంలోని సూరప్పగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు భూరీసర్వేపై గ్రామసభను నిర్వహిస్తున్నట్లు భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటనను విడుదల చేశారు. గ్రామసభకు గ్రామాధికారులంతా హాజరు కానున్నారని, భూములన్న రైతులంతా విధిగా పాల్గొనాలని ఆమె కోరారు.